# శృతిమించినరాగం

హోటల్ బిల్లు చెల్లించాలని హేండ్ బ్యాగ్ తెరిచి అలవాటుగా చెయ్యిలోపలికి పోనిచ్చిన సమీర ఉలిక్కిపడింది. చేతికి చల్లగా తగిలింది! ఏదో జీవి! ఒళ్లంతా గగుర్పాటు! భయంతో గుండె అదిరింది. అప్రయత్నంగా ఆమె నోటి వెంట అబ్బా అని కేక వెలువడింది. హోటల్లోంచి బయటకు పోబోతున్న ఆమె స్నేహితురాళ్ళు లోపలికి వచ్చారు కంగారుగా ఏం జరిగింది? అంటూ. భయంతో ఒణికిపోతూ హేండ్ బ్యాగ్ చూపింది.ఆ బ్యాగ్ నేలమీద పడి ఉంది చేతిలోంచిజారి మల్లిక ఒంగి చూసింది. నల్లగా నిగ నిగ మెరుస్తున్నది. జాగ్రత్తగా బ్యాగ్‌ను కదిపింది. నల్లటి జీవిలో చలనం లేదు. మల్లిక ధైర్యం చేసి దాన్ని వేలితో పట్టుకుని బయటకు తీసి చూపించింది.

తేలు!

చచ్చిన తేలు!

దాన్ని చూసేసరికి సమీర శరీరం ఇంకోసారి కంపించింది.

"బాబోయ్! తేలు!" మల్లిక ఆశ్చర్యంతో అంది.

"తె...తె...తేలు ఎలా వచ్చింది?" సమీర.

"కోతులున్నాయిగా - అవి తెచ్చి వేసుంటాయి." విసుగ్గా, కోపంగా అంది మల్లిక, తేలును విసిరేస్తూ. దూరంగా పడింది తేలు కళేబరం.

గదిలోకి వచ్చి పడిందన్న మాటేగాని సమీరకు ఎంతో ఆందోళనగా ఉంది. మల్లిక ఎంత ఊరడించినా ఏడుపు అగలేదు.

"అసలు నా బ్యాగ్‌లోకి అది ఎలా వచ్చి ఉంటుంది?"

"మీరా! లైబ్రరీలో బ్యాగ్ బల్లమీద పెట్టి పుస్తకాలు తెచ్చుకోవడానికి కొంచెం లోపలికి పోయావుగా.. అప్పుడు ఏ కోతో తెచ్చి వేసుంటాడు." మల్లిక

"అరే! నా బ్యాగే దొరికిందా ఇలాంటి వెదవపన్లు చేయడానికి. నే నెవరికి అపకారం చేశాను?" సమీర బాధ.

"నీ తప్పల్లా నువ్వు జూనియర్ కావడమే!కొత్తగా కాలేజీలో చేరావు. కిందటి సంవత్సరం ఇవన్నీ నేనూ అనుభవించాను. తప్పదు. కొన్నాళ్ళు తట్టుకోవాలి. భయపడితే ఇంకా భయపెడతారు సీనియర్లు." మల్లిక చెప్పింది.

"నాకు చదువు వద్దూ, చట్టుబండలూ వద్దు. ఇంటికి పోతాను. ఇంతలా హింసిస్తారని తెలిస్తే హాస్టల్లో చేరేదాన్నే కాదు. ఛీ! ఛీ !" సమీర అంది.

"వాళ్ళకు భయపడి నువ్వు చదువు మానేస్తావా పిచ్చిపిల్లా ! నీ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటావా? ఈ ర్యాగింగ్ కొద్ది కాలం సరదానే! "మల్లిక చెప్పింది.

కాసేపటికి ఆమె బయట కెళ్ళిపోయింది. గదిలో సమీర ఒంటరిగా మిగిలిపోయింది. ఆమెకు ఏడుపు వస్తున్నది...ఈ మధ్య జరిగిన సంఘటనలు తల్చుకుంటూ ఉంటే!

కాలేజీకి పోయిన మొదటి రోజే అబ్బాయిలు కామెంట్ చేశారు.

"రేయ్! ఎవరో పల్లెటూరు గబ్బిలాయిలా ఉంది." అతని పేరు ప్రకాశం అని తరువాత తెల్సుకుంది.

"అవతారం చూస్తే తెలీటల్లేదురా? మళ్ళీ చెప్పాలా?" వినోద్ కు అన్నీ వినోదాలేట!

ముందు వాళ్ళ వ్యాఖ్యలకు బాధ వేసింది. కోపం వచ్చింది. దుఃఖం కట్టలు తెంచుకొంది. కాని వాళ్ళ ముందు ఏడిస్తే అలుసైపోతుందని తమాయించుకుంది.

ఓసారి వినోద్ తన్ను అటకాయించాడు...

"నా పేరు వినోద్! నీ పేరు...?"

"మీరా..." తడబడింది.

"ఆ(! నేనే! నే నడిగింది నీ పేరు..." వినోద్ నవ్వాడు.

"నా పేరు అదే... మీరా?" చెప్పింది.

"మళ్ళీ మీరు అంటావు – నేనే అడుగుతున్నది – వినోద్‌ను."

సమీరకు ఇంక పేరు చెప్పడం ఇష్టంలేక మౌనం దాల్చింది.

"ఏం అలా మూగమొద్దులా నిలబడ్డావ్. నే నెవరనుకున్నావ్...నా పేరు వినోద్! మీ పేరు తెలుసుకోవచ్చా?"

"సమీర!"

"కొత్తిమీర లాగా అదేం పేరు. నాకునచ్చలేదు." వినోద్ ఎగతాళిగా అన్నాడు.

"మీ పేరూ నాకు నచ్చలేదు." కోపంగా అంది.

"పోనినేను నచ్చానా నీకు?" వెకిలిగా నవ్వాడు.

"ఊహూ! నచ్చలేదు." కటువుగా చెప్పి వేళ్ళబోయింది.

వినోద్‌చెయ్యి అడ్డం పెట్టాడు.

"నేను నచ్చాను అని చెప్పేదాక నిన్ను వెళ్లనివ్వను."

"మిస్టర్! అడ్డు తప్పుకోండి."

"కొత్తిమీర – ఈ వినోద్ తో పెట్టుకోక."

"ఛీ!" వెనక్కి తిరిగి వెళ్ళబోయింది.

వినోద్ ఆమె జడ పట్టుకుని లాగి వెళ్ళిపోయాడు రాకెట్టులాగా. అజాగ్రత్తగా ఉండటం వలన తల వెనక్కి వంగి నెప్పి పెట్టింది. అంతకంటే అహం దెబ్బతిని ఏడ్పు వచ్చింది.

ఓరోజు ప్రకాశ్ ఓ స్వీటు తీసుకువచ్చాడు.

"మీరాబాయిగారు! ఇవ్వాళ నా నాపుట్టిన రోజు. అందుకే ఈ స్వీట్ తెచ్చాను. తీసుకోండి." ఎంతో అప్యాయత ఒలకబోస్తూ కేకు ఇచ్చాడు.

అతని అభిమానానికి ఆనందపడుతూ కేకు నోట్లో పెట్టుకుని కొరికింది.

అంతే! కారం! నాలుక కారంతో తిమ్మిరెక్కిపోయింది.

ఆ గొడ్డుకారానికి కళ్ల వెంట నీళ్లు కారాయి. ప్రకాశ్, అతని మిత్ర బృందం చప్పట్లు కొడుతూ కేరింతలు కొట్టారు. కారం కన్నా – అతని చేతిలో తను అంతసులభంగా మోసపోయి నందుకు బాధ, అవమానం కలిసి ఆమె కళ్లల్లో మరిన్ని నీళ్ల తెప్పించాయి. ఒక రోజు తను పక్క ఊరి అబ్బాయి, అతను తనలా జూనియరే, రమేష్‌తో మాట్లాడుతున్నది. అంతే! మరుసటి రోజు గోడలమీద ఇద్దరి పేర్లు ప్రత్యక్షమయ్యాయి,

'ఇప్పుడే అందిన తాజ వార్త... సమీర రమేష్‌ను పెళ్లాడింది. తొందరలోనే హనీమూన్‌కు తీసుకుపోబోతున్నది...'

ఇట్లా పిచ్చి పిచ్చి రాతలు రాశారు. అది సమీరకే కాదు, రమేష్‌కు కూడ షాక్ కొట్టింది. తప్పించుకు తిరగడం మొదలెట్టాడు. ఇలా ఎన్నో ఎన్నో బాధలు ఆమె అనునిత్యం అనుభవిస్తూనే ఉంది. ఉన్నట్టుండి ఆమె గుడ్డలు పేలికలైపోతాయి. పుస్తకాల్లో కాగితాలు మాయమవుతాయి. ఆమె వెనకాల పిల్లికూతలు, కుక్క అరుపులు వినిపిస్తూ ఉంటాయి. ఏవో కొంటెపాటలు వినవస్తూ ఉంటాయి. సమీర సూట్‌కేసు సర్దుకోవడం మొదలెట్టింది. లోపలికి వచ్చిన మల్లిక సమీర చేస్తున్న పనికి ఆశ్చర్యపోయింది.

"ఏం సమీర! సూట్‌కేసు సర్దావు? ఊరికి పోవాలా?"

"ఆ(! నేను మా ఊరు వెళ్ళిపోతున్నాను."

"ఇంతఅకస్మాత్తు ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నావు?"

"ఈ ర్యాగింగ్ నేను భరించలేకపోతున్నాను."

"అరే! దీన్నే ఇంత సీరియస్‌గా తీసుకోవాలా? మే మందరం అనుభవించలా? వాళ్లే సర్దుకుంటారు."

"కాని...కాని...నాకు మీ సహనం లేదు."

"అదే వస్తుంది...ఊరుకో!"

"లేదు, మల్లికా! నాకు ఆవేశం పెరిగిపోతున్నది. ఉద్రేకం కట్టలు తెంచుకుంటున్నది. నన్ను ఆట పట్టించే ఒక్కోడిని ఎడం కాలి చెప్పుతో కొడదా మనిపిస్తున్నది."

"మొదట్లో అలానే అనిపిస్తూ ఉంటుంది."

"నన్ను అపురూపంగా – ఒక్క మాట అనకుండా పెంచారు మావాళ్లు. ఇక్కడ రోజూ మాటలు పడాలంటే నావల్ల కావడంలేదు. నాకు ఏమీ కానివాళ్లు నన్ను అనరాని మాటలు అంటూ, ఏవేవో చేష్టలు చేస్తూ ఉంటే భరించడం నా వల్ల కావడం లేదు" – సమీర ఏడ్చింది.

"పిచ్చి పిల్లా! నీ మనసు గట్టి పడాలన్నదే ఈ ర్యాగింగ్ ఉద్దేశం. నిన్ను బాధ పెట్టాలని కాదు. నీలోని బెరుకు, అమాయికతనం పోగొట్టి వాళ్లలో ఒకరిగా కలుపుకోవాలనే ఈ అల్లరి. ప్లీజ్! కొన్నాళ్లు ఓపికపట్టు!" మల్లిక.

ఆరోజు కాలేజీలో ఏ గొడవ జరగనందుకు అల్ప సంతోషి సమీర ఆనందంతో హాస్టలు వైపు నడుస్తున్నది. ఇంతలో ఎదురుగా ప్రకాశ్, వినోద్ కనిపించారు.

4608

"హాయ్, మీరా!" ప్రకాశ్.

"ఓయ్ సమీరా!" వినోద్.

"ప్లీజ్ అడ్డు తొలగండి." సమీర బ్రతిమాలింది.

"స్టుపిడ్! నీకు డిన్నర్ ఇవ్వాలని వచ్చాం." ప్రకాశ్.

"డిన్నరా!"

"చెప్పరా!" వినోద్.

"ఎస్ మీరా! మన వినోద్ పుట్టిన్రోజు! గొప్ప విందు ఇద్దామనుకున్నాడు ఈ రాత్రికి. నువు తప్పకుండా రావాలి." ప్రకాశ్ చెప్పాడు నిజాయితీగా.

సమీరకు ఓ క్షణం ఆశ్చర్యం వేసింది. ఏదో మోసం ఉందనిపించింది.

"సారీ! నాకు మొగాళ్లతో కలిసి డిన్నర్ తీసుకునే అలవాటు లేదు. మీ స్నేహితులతో తీసుకోండి సప్పర్!" సమీర అంది.

"అరే ప్రకాశ్! నా ఫిలాసఫీ చెప్పు." వినోద్ అన్నాడు

"వీడి సంగతి తెలీదు కదూ! తన పుట్టిన్రోజుకు అందర్నీ పిలవడు. ఎంపిక చేసి మరీ పిలుస్తాడు. వాళ్లు ఎవరైనా సరే అంగీకరించలేదనుకో..." ప్రకాశ్ ఆపాడు.

సమీర మొహంలో రంగులు మారుతున్నాయి.

"వాళ్లని ఓ పట్టాన వదలడు. చిత్రహింసలపాలు చేస్తాడు." ప్రకాశ్ చెప్పాడు.

నిమ్మకు నీరెత్తినట్టు నిలబడ్డాడు వినోద్. సమీరకు భయం వేసింది.

"సారీ! నాకు ఒంట్లో బాగోలేదు, పోయి రెస్టు తీసుకోవాలి."

"ఎన్నో నెల!" వినోద్ అడిగాడు.

"ఛీ( !" అసహ్యంతో ఒళ్లంతా కంపించింది.

"పడుచుపిల్లలకు ఆరోగ్యం చెడిపోయిందంటే ఇంకే కారణం ఉంటుంది?" ప్రకాశ్ నవ్వాడు.

"ఏముంది? నెల తప్పి ఉంటుంది ఈ నెలవంక." వినోద్.

"ఛీ! మీకు అక్క చెల్లెళ్లు లేరా?" సమీర కోపంగా అంది.

"ఏం పెళ్ళి చేసుకోవా, పిల్లల్ని కనవా?" ప్రకాశ్ విలాసంగా అన్నాడు.

"నువ్వేమన్నా దివినుండి భువికి దిగి వచ్చిన దేవకన్యవా? చూడూ! ఊరికే బెట్టు చేస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. అర్థమయిందా! జస్ట్ భోజనం చేసి వెళ్లిపో!" వినోద్ చెప్పాడు.

"నిజంగా... భోజనమేనా?" సమీర ఆలోచిస్తూ అంది.

"ఎస్ ! ఒక్క మీల్స్ మాత్రమే ! అదీ ఖరీదైన హోటల్లో. పల్లెటూరు నిండి వచ్చినదానివి - హోటల్లో భోజనం గురించి నీకుతెలీదు. అందులో స్టార్ హోటల్ భోజనం గురించి నీకసలు తెలీదు. ఈ రోజు రుచి చూపెడదామని." ప్రకాశ్ విడమరిచి చెప్పాడు.

"ఒక్క షరతు-" సమీర అంది.

"ఏం టది?" నవ్వాడు వినోద్.

"నా స్నేహితురాలు మల్లిక కూడనాతో వస్తుంది." చెప్పింది.

"ఛీ! ఛీ సత్రకాయలాగా నీ పక్కన అదెందుకు?" మొహం చిట్లించాడు వినోద్.

"ఎందుకంటే.. అదంతే.. ఆమె లేనిదీ నేను ఎక్కడికీ రాను." ఖండితంగా చేప్పేసింది.

"పోన్లేరా. కాస్త బిల్లు ఎక్కువవుతుంది. ఓకే చెయ్యి."

"సరే! నేను పిసినికొట్టునేమి కాను-డన్-సాయంత్రం-" వినోద్ చెప్పాడు.

"నో! మేమే వస్తాం. అడ్రసు చెప్పండి." సమీర అంది.

చెప్పాడు వినోద్

సమీర ప్రామిస్ చేసి గబగబా తన గదికి చేరుకుంది. గుండె దడదడ లాడింది. గదిలోకి వచ్చి మంచం మీద వాలిపోయింది. కాసేపటికి మల్లిక వచ్చింది. నుదిటిన ఉన్న చెమటను కూడా తుడుచుకోకుండా శూన్యంలోకి చూస్తున్న సమీరను లేపి కూర్చో బెట్టింది.

"ఏం జరిగింది?"

పూస గుచ్చినట్టు జరిగింది చెప్పి అంది..

"మల్లికా! వాళ్లను ఎలాగైనా వదిలుకోవాలని రాత్రికి పార్టీకి ఒప్పుకుని, వస్తానని చెప్పాను. కాని, ఇప్పుడు వెళ్లబుద్ధి కావడంలేదు. అసలు ఇంతవరకూ ఓపరాయి మొగాడితో అంతసేపు మాట్లాడ్డం - ఐ మీన్ - ఒంటరిగా ఇదే మొదటిసారి!" సమీర మొహాన్ని చేతుల్లో కప్పుకుంటూ అంది.

"మధ్యలోనన్నెందుకు ఇరికించావు? రానని చెప్పాల్సింది. ఇప్పుడు చెప్పిం తర్వాత పోకపోతే..."

"మల్లికా! నేనింత ఆలోచించలేదు. అంత ఎత్తున, అంతలావు గిరజాల జుట్టుతో నుల్చునుంటే వాళ్లని చూసి భయపడి నా మెదడు మొద్దుపారిపోయింది. ప్లీజ్ నువ్వు నాతో రావే ఎలాగోలా ఈ గండం గట్టెక్కించు." మల్లిక చేతులు పట్టుకుని బ్రతిమాలింది. అయిష్టంగా ఒప్పుకుంది ఆమె.

రాత్రి ఇద్దరూ హోటల్ దగ్గరకు చేరుకునేసరికిప్రకాశ్, వినోద్ వీళ్లకోసం ఎదురు చూస్తున్నారు.

"హాయ్! వచ్చారా! మన స్నేహితులు మీ కోసం ఎదురు చూస్తున్నారు.." ప్రకాశ్ అన్నాడు.

"ఇంకా ఉన్నారా ?" మల్లిక అడిగింది.

"ఎస్.. సూర్యం, చంద్రం లోపలున్నారు." లోపలికి దారి తీస్తూ చెప్పాడు వినోద్.

ఖరీదైన హోటల్లో అడుగు పెడుతూంటే ముచ్చెమటలు పోశాయి సమీరకు. ఇంద్ర భవనంలాగా ఉంది. హోటల్స్ అంత అందంగా ఉంటాయని ఆమె కల్లో కూడా ఊహించలేదు. బేరర్ రాగానే ఏవేవో ఆర్డ రిచ్చాడు వినోద్... ఊహా లోకంలో విహరిస్తూ ఉంది సమీర.

"మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" మల్లిక చెప్పింది వినోద్‌కు.

"థ్యాంక్స్!" వినోద్ హుందాగా తలాడించాడు.

ఉన్నట్టుండి మిత్ర బృందం కబుర్లలో పడింది. ఎక్కువగా సినిమాల పైకి పోయింది-సంభాషణ !ముఖ్యంగా హీరోయిన్ల పైన.. వాళ్ల ఆంగికాభినయం పైన విసుర్లు విసిరారు. అప్పుడప్పుడు మల్లిక ఏదో చెప్పింది. సమీర మటుకు తెలీదంది. ఆర్డ రిచ్చిన ఐటమ్స్ వచ్చాయి. సమీర కళ్లు చెదిరిపోయాయి.

"నాకు స్పూన్తో తినడం రాదు." మెల్లగా చెప్పింది సమీర.

మిత్ర బృందం చప్పట్లు కొట్టి ఎగతాళి చేసింది. కుర్చీలో పడి పడి నవ్వారు.

"స్వచ్ఛమైనపల్లెటూరి గబ్బిలాయ్!" చంద్రం అన్నాడు.

"మిస్టర్! ఇలా అవమానిస్తే వెళ్లిపోతాం." మల్లిక అంది.

కన్నీళ్లను కారనీయకుండా మునిపంటితో నొక్కిపట్టిచెంచాతో తినడం మొదలెట్టింది సమీర. సూర్యం తనకుతెలిసిన పల్లెటూరి అమ్మాయిల గురించి ఒకటే జోక్స్ వేయడం మొదలెట్టాడు. వాళ్లు విరగబడి నవ్వారు. సమీర గుండె మండిపోతున్నది. అయినా నిగ్రహించుకుంది. ఇంతలో బేరర్ చికెన్ తెచ్చాడు. మల్లిక్, సమీరలకు ఒళ్లు గగుర్పొడిచింది- ప్లేట్లలోని నాన్‌వెజ్ చూడగానే-వాళ్లు పక్కా శాఖాహారులు మరి !

"ప్లీజ్! వెనక్కి పంపించండి. మేం తినం." మల్లిక చెప్పింది.

"నో... ఇది నా బర్త్‌డే పార్టీ. మీరు తినాల్సిందే. లేకపోతేఈ బిల్లంతా మీరే ఇవ్వాలి." వినోద్ అన్నాడు మొండిగా.

"మిస్టర్ వినోద్! ఇటీజ్ టూ మచ్!" మల్లిక అంది.

సమీరకు కడుపులో తిప్పింది. ఎంత ఆపుకున్నా వాంతి తన్నుకొస్తున్నది. గబుక్కున లేచి పరుగెత్తుకుంటూ వాష్ బేసిన్ దగ్గరకి వెళ్లింది. మల్లిక ఆమెను అనుసరించింది. భళ్లున వాంతి చేసుకుంది సమీర.

"మల్లికా! ఛీ ! ఇంత పశువుల్ని నే ఎక్కడ చూడలేదు."

"తప్పదు... భరించాలి." అనునయంగా అంది మల్లిక.

కొన్ని నిమిషాల తర్వాత వచ్చిన సమీర మల్లికలకు వినోద్ బృందం కనపడలేదు.

"మల్లికా !ఈకోతులు ఎక్కడికి పోయాయి !" విసుగ్గా అంది సమీర అటూ ఇటూ చూసింది.

"చేతులు కడగడానికి పోయారేమో ! కూర్చో! బాగా పొద్దుపోయింది. వార్డెన్ పర్మిషన్

తీసుకున్నాం కాబట్టి సరిపోయింది. వాళ్లు రాగానే వెళ్లిపోదాం.'' మల్లిక అంది.

బేరర్ ఓ పళ్లెంలో బిల్లు పెట్టి తీసుకొచ్చాడు.

''మేడమ్! బిల్లు!'' బేరర్ అన్నాడు.

''మా స్నేహితులు వస్తారు.'' మల్లిక చెప్పింది విసుగ్గా.

''లేదు మేడమ్! మీరు చెల్లిస్తారని చెప్పివాళ్లు వెళ్లిపోయారు.'' సమీర ముందు పెడుతూ అన్నాడు.

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. ఒణుకుతున్న చేతుల్తో బిల్లు తీసుకుని, చూసింది సమీర.

''నాలుగ వందల పాతిక!''

''ఆ(! అంత అయిందా!'' ఆశ్చర్యపోవడం మల్లిక వంతయింది.

బేరర్ వీళ్లవంక విచిత్రంగా చూసి వెళ్ళిపోయాడు.

''ఇడియట్! ఇంత బిల్లు నా మొహాన కొట్టి పారిపోతాడా!'' సమీర దుఃఖంతో అంది.

''మనల్ని భోజనానికి ఆహ్వానించినప్పుడే నాకు దీనిలో ఏదో లొసుగు ఉందనిపించింది కాని ఇంత కుసంస్కారంగా, ఇంత నీచంగా పరాయి చోట ప్ర వర్తిస్తారనుకోలేదు.'' మల్లిక బాధగా అంది.

సమీర హ్యాండ్ బ్యాగ్ తెరచి చూసింది-ఎంత డబ్బు ఉందని. ఇరవై రెండు రూపాయల ముప్పైపైసలు! ఫ్! నాలుగు వందలుంటే గ్రామంలో తమ కుటుంబం ఓ నెల రోజులు సుఖంగా బ్రతికేస్తుంది.

''మల్లిక! నీ దగ్గర-?''

''మీరా! ఓ యాభై ఉంది.'' నిట్టూరుస్తూ చెప్పింది.

ఇద్దరి మొహాల్లో కత్తి వేటుకు నెత్తురు చుక్కలేదు. బేరర్ వచ్చాడు.

''మేడమ్.. బిల్ !''

''బేరర్! మా డబ్బులు ఎవరో కొట్టేశారు.'' మల్లిక.

''మేడమ్! ఈ మాటే మా ప్రొప్రయిటర్‌కు చెప్పండి.'' నిర్లిప్తంగా అన్నాడు బేరర్.

ఇద్దరూ బేరర్ ను అనుసరించి ఓ పెద్ద గదిలోకి వచ్చారు. ఓ పెద్ద టేబుల్ ముందు ఓ పెద్ద మీసాలాయన కూర్చుని ఉన్నాడు.

''సార్! మా డబ్బును ఎవరో కొట్టేశారు. రేపటిదాక గడువు ఇస్తే..'' మల్లిక అంది.

''ఐ.సి! నా బిల్లు అక్కడ పెట్టి కదలండి. రెండు నిమిషాలు టైమ్ ఇస్తున్నా. లేకపోతే పోలీసులకపట్టిస్తా!'' కటువుగా అన్నాడు మీసాలాయన.

ఇద్దరికి ముచ్చెమటలు పోశాయి. సమీర తన ఒంటిని చూసుకుంది. మట్టి గాజులు! పూసల దండ! వేలికి ఓ ఉంగరం! ఆ(! బంగారపు టుంగరం! ఇంటర్ పాసైతే తన తండ్రి కొనిచ్చిన ఉంగరం! ఎంతో బీదరికంలో మగ్గిపోతున్నా... ఎన్నోత్యాగాలుచేసి ఓ ఆరొందలు పెట్టి కొనిచ్చిన ఉంగరం అది! మల్లికను చూసింది. ఆమెతల ఊపింది.

''మిస్టర్! మామీద నమ్మకం లేకపోతే ఈ ఉంగరం ఉంచుకో.'' వేలికున్న ఉంగరం తీసి వణుకుతున్న చేతితో టేబుల్‌మీద ఉంచింది.

మీసాలాయన దాన్ని ఎగాదిగా చూశాడు.

"ఏమి టలా చూస్తున్నావు? అది బంగారందే! ఇప్పుడమ్మినా ఏడొందలపైన ధర పలుకుతుంది. నీ డబ్బు ఇచ్చేదాకా నీదగ్గరే ఉంచుకో!" సమీర విసురుగా అంది.

మీసాలాయన విస్తుపోయాడు. ఇద్దరుగబగబా బయటికి వచ్చేశారు. ఆరాత్రి గోదావరి వాళ్ల కళ్లలో ప్రవహించి ఆగదిని వరదలో ముంచేసింది. ఇంకా కొన్ని రోజులు ఓపికపడితే కాలేజీలో పరిస్థితులు చక్కబడతాయని లేడీ సీనియర్స్ చెప్పడంతో దుఃఖాన్ని దిగమింగుకొని ఊరుకొంది సమీర.

ఆరోజు సెలవు! దగ్గర ఊళ్లనుంచి వచ్చినవాళ్లు ఊళ్లకెళ్లిపోయారు.

'ఒక్క రోజుకు ఎక్కడ పోయొస్తాంలే' అనికొందరు బద్ధకించారు. మల్లిక ఊరి కెళ్లింది.

సమీర ఒక్కతె ఉండిపోయింది. రెండు పూటలా స్నానం చేసే అలవాటు తనకు. సాయంత్రం స్నానాల గదిలో స్నానం చేస్తున్నది. చల్లటి నీళ్లు ఒంటిమీద పడుతూంటే తాత్కాలికంగా తనకున్న సమస్యలు మర్చిపోయింది. కాసేపటికి స్నానం అయిం దనిపించుకుని, డ్రస్ చేసుకుందా మనుకుని తలుపు వంక చూసింది. బట్టలు లేవు! ఆశ్చర్యం! తాను స్నానం చేయబోయేముందు ఎప్పటిలాగే తలుపుమీద వేసుకుంది – బట్టలను. విప్పినవి కూడా దానిపక్కనే వేసింది – రేపు ఉతుక్కోవచ్చని. కాని, ఏవీ కనిపించడం లేదు! సమీరకు మతి పోయింది. చూడబోతేఎవరో కావాలని చేసినట్టున్నారు. చన్నీళ్లతో స్నానం చేసినా ఆమె శరీరం చెమట పోసింది! ఇప్పు డేం చెయ్యాలి! ఒంటిమీద బట్టలు లేకుండా బయట కెలా రావడం!

'మీనాక్షి, సరస్వతి, లక్ష్మి' అందరి పేర్లు పెట్టి గట్టిగా కేకవేసింది.

కాని ఎన్నిసార్లు పిలిచినా బదులే లేదు! ఎవరూ అటువైపు వచ్చిన ఛాయలుకూడలేవు. అందరూ సినిమాకో, షికారుకో వెళ్లినట్టున్నారు! బయట చీకట్లు ముసురుకుంటున్నాయి. అప్పటికే ఆ స్నానాల గదిలో బంది అయిపోయి గంట దాటిపోయింది. ఏంచేయాలో తోచడం లేదు. తలుపు తీసి కొంచెం తల బయటకు పెట్టి చూసింది. వరండాలో ఎవరూ లేరు! ఇలా పరుగెత్తుకుంటూ వెళ్లి తన గదిలో దూరితే! అమ్మో! ఎవరైనా చూస్తే! ఇంకేమైనా ఉందా? ఎవరూ లేరుగా! ఎవరుచూస్తారు? అయినా ఇలా ఎన్ని గంటలు చలికి గజగజ లాడిపోతూ ఒంటిమీద నూలుపోగు కూడా లేకుండా నిలబడ్డం! వరండాలో ఇంకా లైట్లువెలగలేదు. ఎవరూ ఉన్నట్టు లేరు! ఇదే అనుకూల సమయం – పరుగెత్తడానికి! అయినా అంతకంటే తనకి ఇంకేం గత్యంతరం ఉంది కనుక! మనసు గట్టి చేసుకుని తలుపు తీసుకుని బయట కొచ్చింది – అటూ ఇటూ చూసి పరుగు తీసింది.

కాని... కాని... కాని...

మూడు... నాలుగు... మెరుపులుమెరిశాయి!

ఆమె లక్ష్యం గదిలో పోయి పడడం కాబట్టి వాటిని గురించి పెద్దగా పట్టించుకోలేదు. రూమ్ కొచ్చి తలుపు గడియ పెట్టి 'హమ్మయ్య' అనిగాలి పీల్చుకుంది! సమీర ఎలా బట్టలు కట్టుకుందో, ఎలా మంచంమీద దొర్లిపోయిందో ఆమెకు తెలీదు. తెల్లారిన తర్వాత.. అందరూ ఆమెను చూడ్డానికి రాసాగారు. సమీర బిత్తరపోయింది. వార్డెన్ ఓ ఫోటో తెచ్చి సమీర మొహాన కొట్టింది కోపంగా!

"ఏమిటిది!" చిందులు తొక్కింది.

షాక్ తింది... నగ్నంగా తను పరుగెత్తుతున్న ఫోటో!

మరునాడు ఉదయం మల్లిక గదిలో ఆమెకు ఉత్తరం కనిపించింది.

"మల్లికా! కాలేజీలు విద్యాలయాలని, సరస్వతీ కటాక్షం పొందే దేవాలయా లనుకుని భ్రమపడి చేరాను. కాని ఇక్కడ చదువు తప్ప అన్నీ దొరుకుతాయని ఆలస్యంగా తెల్సుకున్నాను. ఇక్కడ చదువు తప్ప విద్యార్థినీ విద్యార్థులు అన్నీ నేర్చుకుంటారని కొంచెం ఆలస్యంగా గ్రహించాను. మాది బీద కుటుంబం! నేను కాలేజీలో చేరడానికి మావాళ్లు రోజూ ఒక పూట భోజనం మానేస్తున్నారు. వాళ్ల త్యాగానికి గుర్తింపుగా నేను బాగా చదువుకొని, మంచి ఉద్యోగం సంపాదించి బాగా సంపాదిద్దామనుకున్నాను. వాళ్లను సుఖపెడదామనుకున్నాను. కాని ఈ వాతావరణం చూసిన తర్వాత కాలేజీ అన్నా చదువు అన్నా నాకు అసహ్యం వేసింది. అందుకే వెళ్లిపోతున్నాను. ఈ ర్యాగింగ్‌ను ఏ రాజారామ్మోహనరాయో మాన్పించేదాకా విద్యాలయాలకు మోక్షం లేదు. బై... బై... బై... సమీర!"

మల్లిక కంటినుండి కన్నీళ్లురాలాయి.

వినోద్, ప్రకాష్ మామూలుగానే తిరుగుతున్నారు. మామూలుగానే జోక్స్‌వేస్తున్నారు.

(ఆంధ్ర ప్రభ వారపత్రిక-----------)

